క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

శింగనమల: మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం సోమవారం శింగనమలలోని రామాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ చిక్కాల బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల పదవులు వచ్చిన నాయకులను సన్మానిస్తామన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

21న తాతార్యారూఢస్వామి పుష్ప రథోత్సవం

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో ఈనెల 21న తాతార్యారూఢ స్వామి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఆదినారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాతార్యా రూఢస్వామి జీవ సమాధి కావడంతో ఏటా గ్రామస్తుల ఆధ్వర్యంలో తిరునాల నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. బుధవారం ధ్వజారోహణ, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, గురువారం గంగపూజ, కలశ స్థాపన, రుద్రయజ్ఞం, స్వామి వారికి పట్టు వస్త్రాల సమర్పణ, సహస్ర బిల్వార్చన, రాత్రి 10 గంటలకు స్వామి పుష్ప రథోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులను అందజేస్తున్న సభ్యులు

తాడిపత్రి అర్బన్: పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం టీచర్స్ కాలనీలోని పెన్షనర్ భవన్‌లో దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ప్రతి నెలా 17న నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆదివారం పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సత్యప్రసాద్ ఆధ్వర్యంలో 12 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి అశ్వర్థరెడ్డి, కోశాధికారి వెంకట్రామయ్య, సభ్యులు పాల్గొన్నారు.

సభా స్థలి పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడిపత్రిరూరల్: ఈనెల 20న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తాడిపత్రిలో పర్యటించే అవకాశం ఉందని ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఎన్నికల ప్రచార బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట నాయకులు కందిగోపుల మురళీ, కంచం రామ్మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

నార్పలలో సాయుధ దళాల కవాతు



కవాతు చేస్తున్న సాయుధ దళాలు

నార్పల: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు మండల కేంద్రంతో పాటు బండ్లపల్లి, బి.పప్పూరు, గూగూడు గ్రామాల్లో ఆదివారం పోలీసులు కేంద్ర సాయుధ దళాలతో కలసి కవాతు నిర్వహించారు. బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ ధర్మేంద్ర సింగ్, సీఐ శ్రీధర్, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కవాతు సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చేస్తామన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని వారు సూచించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించండి

- శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి శంకర్‌నారాయణ
- ప్రచారంలో పాల్గొన్న పైలా నరసింహయ్య, ఆలూరు సాంబశివారెడ్డి



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి శంకర్‌నారాయణ, పైలా



పుట్లూరులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పుట్లూరు: జగనన్న సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి మీ విలువైన ఓటును వేసి ఆశీర్వదించాలని శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజినేయులు, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి శంకర్‌నారాయణ కోరారు. ఆదివారం మండలంలోని తిమ్మాపురం, గాండ్లపాడు, శనగలగూడూరు, తక్కళ్లపల్లి, పుట్లూరు, పి.చింతలపల్లి, బాలాపురం, గోపురాజుపల్లి, కోమటికుంట్ల, జీసీపల్లి తదితర గ్రామాల్లో వారు ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అర్హతే ప్రమాణికంగా పార్టీలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. టీడీపీ హయాంలో సిఫార్సు ఉన్న వారికి మాత్రమే అరకొర సంక్షేమ పథకాలను అందించారని, జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. భవిష్యత్తులో ప్రజా సంక్షేమ పాలన కొనసాగడానికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీతమ్మ, ఎంపీపీ రాఘవరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మూలి వెంకటరామిరెడ్డి, ఎంపీటీసీ నాగార్జునరెడ్డి, నాయకులు మడుగుపల్లి నాగేశ్వరరెడ్డి, కంచెం శ్రీనివాసులరెడ్డి, కందికాపుల శ్రీధర్‌రెడ్డి, రమణారెడ్డి, శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, రామమోహన్‌రెడ్డి, సాయినాథరెడ్డి, నరేంద్రరెడ్డి, రామక్రిష్టారెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రచారం ఇలా..

పుట్లూరు మండలంలో సోమవారం వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎ.కొండాపురం, అరకటివేముల, సూరేపల్లి, కడవకల్లు, సంజీవపురం, ఓబుళాపురం, దోసలేడు, చెర్లోపల్లి, నారాయణరెడ్డిపల్లి, చాలవేముల, మడ్డిపల్లి, కుమ్మనమల, కొండుగారికుంట, రంగమనాయునిపల్లి, రంగరాజుకుంట, మడుగుపల్లి, జేఆర్‌పేట, ఎల్లుట్ల గ్రామాల్లో ప్రచారం ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి శంకరనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, నియోజకర్గ పరిశీలకుడు రమేష్‌రెడ్డి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. ఉదయం 8కి ఎ.కొండాపురం గ్రామం నుంచి ప్రచారం ప్రారంభమవుతుందన్నారు.

పరామర్శ



కొండమ్మను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని గాంధీ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు మనేరి కొండమ్మను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామి రెడ్డి ఆదివారం పరామర్శించారు. గత కొద్ది రోజులుగా కొండమ్మ అనారోగ్యంతో బాధపడతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆమె ఇంటికి వెళ్లి ఆరోగ్యం, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న దృశ్యం

తాడిపత్రిరూరల్: పట్టణంలోని 1వ వార్డులో ఉన్న గాంధీనగర్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో 15 కుటుంబాలు పార్టీలో చేరాయి. వైఎస్సార్‌సీపీ అందిస్తున్నా సంక్షేమ పథకాలకు అకర్షితులై పార్టీలో చేరామని వారు తెలిపారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు,

నేడు జాబ్‌మేళా

బుక్కరాయసముద్రం: మండలంలోని గుత్తిరోడ్డు సమీపాన ఉన్న శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వరలక్ష్మి ఆదివారం తెలిపారు. బెంగళూరుకు చెందిన ఆల్ సీ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నారన్నారు.

ఓటుహక్కు సద్వినియోగం చేసుకోండి



పెద్దపప్పూరు మండలం చిక్కేపల్లిలో మాట్లాడుతున్న ఎస్‌ఐ శరత్ చంద్ర



పెద్దవడుగూరులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ శేషారామసింగ్, ఎస్‌ఐ శ్రీనివాసులు

పెద్దపప్పూరు: ఓటుహక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ శరత్ చంద్ర అన్నారు. ఆదివారం చిక్కేపల్లిలో ఆయన సమావేశం నిర్వహించారు. ఆధిపత్యం కోసం సమస్యల జోలికి వెలితే జీవితాలు దెబ్బతినడంతోపాటు కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందన్నారు. గ్రామంలో చిన్నపాటి సమస్య వచ్చినా పోలీసులకు సమాచారం అందిస్తే తక్షణమే పరిష్కరిస్తారన్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: ఓటర్ల సమస్యలు, పోలింగ్ కేంద్రాల్లోని సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తామని తహసీల్దార్ ఆర్.శేషారామ్‌సింగ్, ఎస్‌ఐ శ్రీనివాసులు అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం పెద్దవడుగూరు, కాశేపల్లి, మిడుతూరు, గుత్తిఅనంతపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా మౌలిక వసతులపై ఆరా తీశారు.

రూ. 3.75 కోట్ల లాభాల్లో టౌన్ బ్యాంకు



మాట్లాడుతున్న టౌన్ బ్యాంకు చైర్మన్ అబ్దుల్ జిలాన్

గుత్తి: గుత్తి కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకు రూ. 3.75 కోట్ల లాభాల్లో ఉందని ఆ బ్యాంకు చైర్మన్ అబ్దుల్ జిలాన్, సీఈఓ మహేశ్వర ప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్న వసుధా ఫంక్షన్ హాల్లో ఆదివారం టౌన్ బ్యాంకు సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బ్యాంకు అధికారులు, సిబ్బంది, డైరెక్టర్లు ముఖ్యంగా కస్టమర్ల చొరవతో బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. బ్యాంకు స్థాపించి 102 వసంతాలు పూర్తయిందన్నారు. ఇటీవలే బ్యాంకుకు జాతీయ స్థాయి అవార్డు దక్కిందన్నారు. పామిడిలో టౌన్ బ్యాంకు బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు. భవిష్యత్‌లో టౌన్ బ్యాంకును మరింత విస్తరించడంతో పాటు అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ రాము, డైరెక్టర్లు కృష్ణ, స్టోర్ నాగరాజు, రంగప్రసాద్ రాయల్, అంగడి నాగరాజు, మాబు, మధు, వీరన్న, వెంకటేశ్ బాబు, దాదా ప్రొఫెషనల్ డైరెక్టర్లు ఎంవి మహేష్ కుమార్, మైను, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ఎన్నికల కోడ్ వర్తించదా?



కొత్తపల్లిలో తొలగించని టీడీపీ నేతల పోస్టర్లు

యల్లనూరు: మండలంలోని కొత్తపల్లి, శింగవరం, కల్లూరు గ్రామాల్లో బాబు ష్యూరిటీ....భవిష్యత్తు గ్యారెంటీ గోడపత్రికలు దర్శనమిస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, శింగనమల నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ గోడ పత్రికలు కనిపిస్తున్నాయి. మండలంలో అధికారులు ఏం చేస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. వాటిని తొలగించకపోతే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు.

ఫ్లెక్సీల తొలగింపు

శింగనమల: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా శింగనమలలో వివిధ పార్టీలకు సంబంధించిన జెండాలను ఆదివారం తొలగించారు. శింగనమల రామాలయం వద్ద ఉన్న పార్టీ జెండాలను తొలగించారు. ఆర్టీసీ బస్టాండులో ఉన్న బ్యానర్లు, ఫ్లెక్సీలు తీసివేయించారు. అలాగే గోడలకు అతికించిన వివిధ పార్టీల పోస్టర్లును తొలగించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి ముసుగు వేశారు. వీఆర్వో తాతయ్య, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్‌-1 పరీక్ష



వివరాలను తెలుసుకుంటున్న నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఏపీపీఎస్సీ గ్రూప్‌–1 పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం పేపర్‌–1 పరీక్షకు 288 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 215 మంది, మధ్యాహ్నం పేపర్‌–2 పరీక్షకు 213 మంది మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని అనంతపురం నగర పాలక సంస్థ కమిషనర్, ఏపీపీఎస్సీ గ్రూప్‌–1 సర్వీసెస్ కోఆర్డినేటర్ ఆఫీసర్ మేఘ స్వరూప్ పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఒకే పీఠంపై శివ కేశవులు!

- నాటి వేడుకాపురమే...నేటి యాడికి
- నేటి నుంచి శివలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



చెన్న కేశవస్వామి మూల విరాట్



బ్రహ్మ రథోత్సవానికి హాజరైన అశేష జనవాహిని (ఫైల్)

యాడికి: ఒకే పీఠంపై శివ కేశవులను జనమేజయ మహారాజు ప్రతిష్ఠించారని ఆలయ చరిత్ర చెబుతోంది. అందుకే ఇక్కడ శివభక్తులు, విష్ణు భక్తులు అందరూ కలిసిమెలసి ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. ఇక్కడ చెన్నకేశవుడు కుడి అభయ హస్తం కింద లింగం ఆకారంలో కొలువై ఉన్నాడు. మహా విష్ణువుకు కుడి చేతిలో చక్రం, ఎడమ చేతిలో శంఖువు ఉంటుంది. కానీ భిన్నంగా ఇక్కడ విష్ణు రూపంలో ఉన్న చెన్నకేశవుడి కుడి చేతిలో శంఖువు, ఎడమ చేతిలో చక్రం ఉండటం విశేషం. చెన్నకేశవస్వామి ఆలయంలో ఉన్న మూడు ఉపాలయాల్లో ఆంజనేయ స్వామి ఒకటి. ఇక్కడ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఉత్తరాభిముఖంగా ప్రతిష్ఠించారు. రావణాసురుడు సీతను అపహరించిన తర్వాత సీతమ్మ జాడను కనుగొన్న ఆంజనేయుడు ఆ సమాచారాన్ని రాముడికి అందివ్వాలని వెతుక్కుంటూ ఉత్తర దిక్కుకు పోయే సమయంలో ఈ ఆలయంలో ఆంజనేయుడు విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు అర్చకుడు హరికృష్ణ శర్మ అంటున్నారు. గర్భ గుడిలోని శివ, కేశవుల సన్నిధిలో నిత్యం వెలిగే జ్యోతిని గర్భగుడి బయట ప్రతిష్ఠించిన గరుత్మంతుడు ద్వారం మూసివేసి ప్రధాన ఆలయం తలుపుల రంధ్రం ద్వారా భక్తులు చూసేందుకు అనువుగా ఉంది. చోళుల కాలంలో తిరుమలాంబ ఆలయ గోపురాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. శ్రీకృష్ణదేవరాయలు హంపీ నుంచి తిరుమలకు వెళ్లే సందర్భంలో ఇక్కడే ఉంటూ ఘనంగా బ్రహ్మోత్సవాలను వేడు కాపురంగా నిర్వహించేవారని, దేవాలయానికి ఎదురుగా కుంటలో తెప్పోత్సవం నిర్వహించేవారనీ తెలుస్తోంది. ఇలా 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలను రోజుకో అలంకారంలో స్వామి వారికి పూజలు, వేడుకలు నిర్వహించటంతో ఈ గ్రామాన్ని వేడుకాపురంగా పిలిచేవారనీ, కాలక్రమేణా యాడికిగా పిలుస్తున్నారు. ప్రస్తుతం ఏటా ఫాల్గుణ మాసంలో మాత్రమే బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఫాల్గుణ పౌర్ణమి రోజు శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి వారికి కల్యాణం జరిపించి, అదే రోజు సాయంత్రం బ్రహ్మ రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ.

నేడు ఉత్సవాలు ప్రారంభం

చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం నుంచి శివలక్ష్మీ బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఉత్సవ కమిటీ చైర్మన్ బొంబాయి రామిరెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం అంకురార్పణ, కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభిస్తామన్నారు. 19న ఉదయం ధ్వజారోహణం, స్వామిని పెళ్లి కుమారుడిగా చేయుట, రాత్రికి పుష్ప విమానోత్సవం, 20న సింహ వాహనోత్సవం, 21న గురువారం శేష వాహనోత్సవం, 22న శుక్రవారం ఆంజనేయ స్వామి వాహనోత్సవం నిర్వహిస్తామన్నారు. 23న గరుడోత్సవం, 24న గజేంద్ర వాహనోత్సవం, 25న శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామికి కల్యాణ మహోత్సవం, సాయంత్రం రథోత్సవం, 26న అశ్వ వాహనోత్సవం 27న ఉదయం వసంతోత్సవం, రాత్రికి హంస వాహనోత్సవం, పట విసర్జన ఉంటుందన్నారు. 28న గురువారం శయనోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు



పెద్దవడుగూరు జెడ్పీ పాఠశాలలో బెంచీలపై హాల్ టికెట్ నంబర్లు వేసిన దృశ్యం

తాడిపత్రి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తాడిపత్రి నియోజకవర్గంలో 5,024 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 17 కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఇప్పటికే ఆయా పరీక్ష కేంద్రాల్లో అన్ని రకాల మౌలిక వసతులను విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసినట్లు ఎంఈఓలు తెలిపారు. ప్రతి కేంద్రానికీ ఒక డిపార్ట్‌మెంటల్ అధికారితో పాటు ఒక సూపరింటెండెంట్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ప్రశ్నపత్రాలు స్థానిక పోలీస్ స్టేషన్లకు చేరుకున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

యాడికి: మండలంలో 1,030 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని ఎంఈఓ కాశెప్ప ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యాడికి ఉన్నత పాఠశాలలోని ఏ సెంటర్‌లో 278 మంది, బి సెంటర్‌లో 272 మంది, వాగ్దేవి పాఠశాలలో 240, ప్యారడైజ్ 240 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ఆయా సెంటర్లకు చీఫ్‌లు నాగన్న, నరసింహులు, రాజేశ్వరి, నరసింహారెడ్డి, డీఓలు జయరామ్, చంద్రశేఖర్, రవీంద్ర, మురళీకృష్ణ తదితరులు నియమితులయ్యారన్నారు.

పెద్దవడుగూరు: పెద్దవడుగూరులోని జెడ్పీ పాఠశాలలో 193 మంది రెగ్యులర్ విద్యార్థులు, 146 మంది ప్రైవేటు విద్యార్థులు, సరస్వతి హైస్కూల్ లో 290 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ రాముడు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తామని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

శింగనమల: మండలంలోని పదో తరగతి విద్యార్థులకు శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో మూడు సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ నరసింహరాజు తెలిపారు. పరీక్షలకు 658 మంది విద్యార్థులు హాజరువుతున్నారన్నారు. అందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏ–సెంటరులో 240 మంది, బీ–సెంటరులో 238 మంది, కేజీబీవీలో 180 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు.

గార్లదిన్నె: మండలంలో సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని, పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ తారా చంద్రనాయక్ తెలిపారు. ఆదివారం ఎంఈఓ మాట్లాడుతూ మండలం కేంద్రం గార్లదిన్నె, కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్, మోడల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే చీఫ్ సూపరింటెండెంట్లుగా సుంకన్న, కిష్టప్ప, హనుమన్నను నియమించారన్నారు. మండల వ్యాప్తంగా 883 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు ఆయన తెలిపారు.

యల్లనూరు: సోమవారం నుంచి ఈ నెల 30 వరకూ పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి తెలిపారు. యల్లనూరు జడ్పీ హైస్కూల్, చిలమకూరు మోడల్ స్కూల్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. రెండు సెంటర్లు కలిపి 231 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.

బుక్కరాయసముద్రం: మండలంలో సోమవారం టెన్త్ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేశామని మండల విద్యాధికారి గురు ప్రసాద్ తెలిపారు. మండలంలో 508 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, అన్నే ఫెర్రర్ స్కూల్, ఆర్డీటీ బధిరుల పాఠశాలల్లో పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

పామిడి: మండలంలో 1,064 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాస్తున్నారని అధికారులు తెలిపారు. స్థానిక టీసీ హైస్కూల్‌లో 304 మంది విద్యార్థులు, ఎస్ఎఫ్ఎస్‌లో 300 మంది విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 230 మంది, సరస్వతీ విద్యామందిరంలో 230 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

కూటమిని చిత్తుగా ఓడించండి

గుంతకల్లుటౌన్: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీ, టీడీపీ, జనసేన కూటమికి ప్రజలు ఓటు రూపంలో బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బాలరంగయ్య సూచించారు. ఆదివారం సీఐటీయూ కాలనీలో సీపీఎం పట్టణ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకపోవడమే కాకుండా విభజన హామీలను అమలు చేయని బీజేపీతో టీడీపీ, జనసేన పార్టీలు జతకట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసులు, నాయకులు దాసరి శ్రీనివాసులు, మారుతి, రమేష్, నాగరాజు, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.